

స్విమ్మింగ్ విజేతలకు కలెక్టర్ ప్రశంస

ఏలూరు : జాతీయ సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బలగ స్వామినాయుడుని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. విజయవాడలో ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు నిర్వహించిన 35వ జాతీయ సౌత్‌జోన్ పోటీల్లో జిల్లాకు చెందిన బలగ స్వామినాయుడు 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావుతో కలిసి స్వామినాయుడు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి స్వామినాయుడును అభినందించి చదువులోనూ బాగా రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని అభినందించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు నీకేం కావాలని కలెక్టర్ ప్రశ్నించారు. దీనిపై ఆయన స్పందిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా స్విమ్మింగ్ రేసింగ్ సూట్ అవసరమని తెలపగా, స్విమ్మింగ్ రేస్ సూట్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, కోచ్ బి.గణేష్‌ను కూడా అభినందించారు.

ఆగిన ఆరోగ్యశ్రీ 'ఆసరా'..!

సర్జరీ రోగులకు ఆర్థిక సాయం నిలుపుదల

గత ప్రభుత్వంలో రోజుకు రూ.225, నెలకు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం

1,625 రకాల సర్జరీలకు ఈ పథకం వర్తింపు

ప్రతినెలా రెండు జిల్లాల్లో 3 వేలకుపైగా సర్జరీలు

రోగులకు సాయం నిలుపుదలపై తీవ్ర విమర్శలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆరోగ్యశ్రీలో వివిధ రకాల సర్జరీల ద్వారా చికిత్స పొందిన రోగులు కోలుకునే వరకూ అందించే ఆర్థిక సాయం 'ఆసరా'ను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన రోగులకు ఎటువంటి ఆర్థిక చేయూత లేకుండాపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వం వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో కొన్ని మార్పులు చేసింది. ఆరోగ్యశ్రీలో సర్జరీలు చేయించుకున్న రోగులు కోలుకునే వరకూ రోజుకు రూ.225, కనీసంగా నెలకు రూ.ఐదు వేలు చొప్పున ఆర్థిక సాయం చేసే ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇది ఎంతోమంది రోగులకు ఉపయోగంగా ఉండేది. సర్జరీ తర్వాత ఏ పనీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ సొమ్ము మందులకు, ఇతర అవసరాలకు ఉపయోగపడేది. ఈ ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేరును మార్చి ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్ పేరుతో అమలు చేస్తోంది. ఇక్కడ వరకూ ఎవరికీ పెద్దగా ఇబ్బంది లేదు. రోగులకు ఎంతగానో ఉపయోగపడే 'ఆసరా' పథకం నిలుపుదలపై మాత్రం తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ఆసరా పథకంలో 1,625 రోగాలకు సంబంధించిన సర్జరీలు చేయించుకున్న రోగులకు రోజుకు రూ.225 చొప్పున ప్రభుత్వం అందించేది. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లేలోగా ఈ సొమ్ము రోగుల ఖాతాల్లో జమయ్యేది. ఈ పథకం నిలుపుదలతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో నెలకు సరాసరి ఐదు వేల మంది వరకూ ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో ఆర్యోగశ్రీ సేవలు పొందుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ 'ఆసరా' పథకం పరిధిలోకి వచ్చే సర్జరీలు 2,105 వరకూ జరిగాయి. ఆర్యోగ్యశ్రీ 'ఆసరా' పథకం కింద రూ.కోటీ 14 లక్షలు వరకూ ఆర్థికసాయం రోగులకు అందింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ 'ఆసరా' పథకం పరిధిలోకి వచ్చే సర్జరీలు 19,019 వరకూ ఉన్నాయి. సర్జరీ జరిగిన రోగులకు ఆసరా కింద అందిన సాయం రూ.10.52 కోట్లు. ఆసరా ద్వారా అందిన సొమ్ము రోగులకు ఎంతగానో ఉపయోగపడేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండాపోయింది.

అక్టోబర్ నుంచి 'ఆసరా' నిలుపుదల..

ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఆరోగ్యశ్రీ ఆసరా పథకం నిలిచిపోయింది. దీంతో రోగులకు ఆర్థిక సాయం అందడం లేదు. గత లెక్కలను బట్టి పరిశీలిస్తే ఈ పథకం నిలిచిన ఈ మూడు నెలల్లో దాదాపు తొమ్మిది వేల మంది రోగులకు ఆర్థిక సాయం అందకుండాపోయిందని చెప్పొచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం అత్యంత ఖరీదైందిగా మారిపోయింది. జ్వరం వచ్చిందని ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లినా కనీసం రూ.30 వేల నుంచి రూ.50 వేలు పిండేస్తున్నారు. ప్రసవాలకైతే రూ.లక్ష వరకూ గుంజుతున్నారు. దీంతో సామాన్య ప్రజానీకం ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లోనే వైద్యం చేయించుకుంటున్నారు. ఈ పథకంలో చికిత్స పొందేవారంతా నిరుపేదలే. ధనవంతులు ఎవరూ ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే పరిస్థితి లేదు. పేద కుటుంబాలకు అండగా ఉండే ఆరోగ్యశ్రీ ఆసరాను కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయడం దారుణంగా చెప్పొచ్చు. సర్జరీ చేయించుకున్న తర్వాత రోగి కోలుకోవడానికి నెలల సమయం పడుతోంది. అప్పటి వరకూ చిల్లిగవ్వ ఆదాయం ఉండదు. అటువంటి వారికి ఆసరా ద్వారా అందించే సొమ్ము ఎంతో ఊరటనిస్తోంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై పునరాలోచించి ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో సర్జరీలు చేయించుకునే రోగులకు ఆసరా పథకం వర్తింపజేయాలని అంతా కోరుతున్నారు.




ఏలూరులో నిరసన తెలుపుతున్న వామపక్షాల నేతలు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు

అంబేద్కర్‌ను కించపర్చిన
అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి
వామపక్షాల ఆధ్వర్యాన నిరసనలు

పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే ప్రధాని మోడీ అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు జిల్లాలో కదంతొక్కాయి. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో అమిత్‌షా బొమ్మలను దహనం చేశారు. చాట్రాయి, కుక్కునూరు, బుట్టాయగూడెం, ముసునూరు, నూజివీడు, వేలేరుపాడు, పోలవరం, పెదపాడు, ఆగిరిపల్లి, కలిదిండి తదితర కేంద్రాల్లో నిరసనలు సాగాయి.

వార్త 6లో..



అమిత్‌షా బొమ్మను దహనం చేస్తున్న నేతలు

పిజిఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసంలో) అందిన అర్జీల పరిష్కారం జవాబుదారీతనంతో ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 207 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్‌అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కరరావు, ఎం.ముక్కంటితో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు పిజిఆర్ఎస్‌లో సమర్పించే అర్జీలకు సత్వర పరిష్కార దిశగా పని చేయడం అత్యంత ప్రధానమన్నారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిర్ధేశించిన సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను అధికారులు క్షుణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాలన్నారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన ఎం.లలిత సూర్యపద్మావతి అర్జీనిస్తూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో తీసుకున్న మార్ట్‌గేజ్ లోనును తీర్చివేశామని, అయితే ఇసి తీసుకున్నప్పుడు అందులో లోను చెల్లించాల్సి ఉన్నట్లు ఉందని వాపోయారు. దీనిపై విచారణ జరిపి లోన్ క్లియరెన్స్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు మండలం కొత్తగూడేనికి చెందిన మాగుంట నాగేంద్రప్రసాద్ అర్జీనిస్తూ 22ఎ నిషేధిత జాబితాలో ఉన్న తమ భూమిని సదరు జాబితా నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు రూరల్ మండలం కొమడవోలుకు చెందిన గుండిగుంట రుక్మిణీదేవి అర్జీనిస్తూ తమ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం వన్ బి అడంగళ్లు ఆన్‌లైన్లో నమోదు చేయాలని కోరారు. ఉంగుటూరు మండలం వెలమెల్లి గ్రామానికి చెందిన దండమూడి నాగేశ్వరరావు అర్జీనిస్తూ దుర్వినియోగమైన పంచాయతీ నిధులు విషయంపై విచారణ జరపాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి

విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్లు అందజేత

సంక్షేమం, అభివృద్ధి ప్రజల ఆకాంక్షల దిశగా ప్రజలందరి కృషి తోడై మనదేశం, రాష్ట్రం అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబడేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ ప్రాంగణంలో సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల సైకిళ్లను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి అందజేశారు.


సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు

సేంద్రియ ఆహారం, ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరం వద్ద ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాలను జెసి పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఆయా సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాలలో ఉత్పత్తుల ప్రత్యేకతల వివరాలను కలెక్టర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఉత్పత్తులను కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి కొనుగోలు చేశారు.

సిఎలో సత్తాచాటిన ఆటో డ్రైవర్ కుమార్తె

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉన్నత చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది గీతాంజలి. మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన పుట్టా వీరన్న, శ్రీదేవి దంపతుల కుమార్తె గీతాంజలి సిఎ (చార్టర్ ఎకౌంటు)లో ఉత్తీర్ణత సాధించారు. ఆమె తండ్రి వీరన్న ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ గీతాంజలిని చదివించడడానికి ఎంతో కష్టపడ్డారు. వీరన్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్నకుమార్తె పట్టుదలతో చదివింది. పదో తరగతి వరకు నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివింది. ఇంటర్ చైతన్య కార్పొరేట్ స్కూల్లో ఉచిత సీటు పొంది అక్కడా ఉత్తీర్ణత సాధించింది. తండ్రికి తోడుగా ఉండాలని తపనతో నిద్రాహారాలు మాని సిఎలో ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా పుట్టా వీరన్న మాట్లాడుతూ సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధ్యమని తన కుమార్తె నిరూపించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గీతాంజలిని గ్రామపెద్దలు, నాయకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.


తల్లిదండ్రులతో గీతాంజలి (మధ్యలో)

కంటి చెమ్మ ఆరేనా..!

అభివృద్ధిలో అద్భుతాలు సృష్టిస్తున్నాం.. సంప్రదాయాల్లో మనమే ఆదర్శం.. ప్రగతిలో పరుగులు పెడుతున్నాం.. అని గొప్పలు చెప్పుకుంటున్నాం.. అయితే ప్రేమోన్మాదం పెచ్చురిల్లుతోంది.. మానవ మృగం మగువల జీవితాలను చిదిమేస్తోంది.. ముక్కుపచ్చలారని పసిమొగ్గలపై పైశాచికత్వం చూపుతోంది. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లయినా మహిళలకు రక్షణ లేదు.. జీవితాల్లో మార్పు లేదు.. కంటి చెమ్మ ఆరలేదు.. నిర్భయ, పొక్సో చట్టాలున్నా కీచకుల ఆగడాలు ఆగడం లేదు.. ఏటా అత్యాచారాలు, వరకట్న వేధింపులు, హత్యలు పెరుగుతున్నాయి.. ఇలాంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో ఎన్నో..

- డెస్కు

ఏలూరు

అశోక్‌నగర్‌లో గుండెలు పిండేసే ఘటన జరిగింది. స్థానికంగా ఓ మిషనరీ వసతిగృహంలో ఉంటూ ఇంటర్ చదువుతున్న బాలిక గర్భం దాల్చింది. తొమ్మిది నెలల తరువాత ఆమె ప్రసవించిన బిడ్డను వసతి గృహం పైనుంచి విసిరి ఉసురుతీశారు. పక్కనున్న అపార్టుమెంట్‌కు సంబంధించిన వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు.

ప్రేమ పేరుతో ఓ ఉన్మాది సత్రంపాడుకు చెందిన యువతి రత్నాగ్రేస్(23)ను కడతేర్చిన ఘటనతో జిల్లావాసులు ఉలిక్కిపడ్డారు. ముసునూరుకు చెందిన యువకుడు ఏసురత్నం ఆమెను ప్రేమ పేరుతో వేధించాడు. తనకు పెళ్లి కుదిరిందని చెప్పినా వినలేదు. తనను పెళ్లి చేసుకోకుంటే చంపేస్తానంటూ బెదిరించాడు. ఒప్పకోలేదని కత్తితో పాశవికంగా నరికి చంపాడు. అక్కడితో ఆగకుండా తన గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

● పెదవేగి మండలం నుంచి ఏలూరు వచ్చి హోటల్‌లో పని చేసుకుంటూ రాత్రివేళల్లో ఆరుబయటే నిద్రిస్తున్న మహిళపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడటం తీవ్ర సంచలనం సృష్టించింది.

● ఏలూరులో ఓ ప్రయివేటు వసతి గృహంలో ఉన్న విద్యార్థినులను బయటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వార్డెన్ భర్త నిర్వాకం వెలుగుచూడటంతో అంతా నివ్వెరపోయారు.

● నూజివీడు మండలంలో ఆరుబయట నిద్రిస్తున్న చిన్నారిని అక్కడకు లోడు దింపేందుకు వచ్చిన లారీ క్లీనర్ సమీప తోటల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు

వదలట్లేదు..! ★★★

ప్ర బ. ం త్వ మొదలుకుని ప్రయివేటు సంస్థల వరకూ పని ప్రదేశాల్లో మహిళలకు లైంగిక వేధింపులు సర్వసాధారణంగా మారాయి. చెప్పినట్లు చేయకుంటే ఉద్యోగ భవిష్యత్ ఉండదన్న బెదిరింపులూ మామూలే. వీటిఇ తిరస్కరించినా తమను ప్రత్యేక వ్యక్తులుగాచూడడానికి అంగీకరించకపోయినా తీవ్ర పరిణామాలు తప్పవని ఒత్తిళ్లు ఉంటాయి. విద్యార్థులనైతే అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ చేస్తామంటారు. అలాంటి వారికి భయపడి జీవితాన్ని చీకటి చేసుకుంటున్నారు చాలా మంది. బాధితులు మౌనంగా ఉండడాన్ని అలుసుగా తీసుకుని కీచకులు రెచ్చిపోతున్నారు.

కంటిపాపలను కనిపెట్టుకుని ఉండండి.. ★★★

ముద్దు చేసినట్లుగా దగ్గరకు చేరదీస్తారు. ఆ ముసుగులో ఎక్కడెక్కడో తాకుతారు. ఒళ్లంతా తడుముతారు. ఇంట్లో, పక్కింట్లో, ఎదురింట్లో పరిసరాల్లో చివరికి బడిలో ఇలా ఎక్కడైనా సరే ఇలాంటి కీచకులు పొంచి ఉండొచ్చు. పిల్లలను చూసుకునే తీరిక లేకో, ఇతర కారణాల వల్లో చాలా మంది

పనిచేసే చోటా..




తెలిసిన వారికి, బంధువులకు తమ పిల్లలను అప్పగిస్తుం టారు. కొందరు మృగాళ్లు వారితో అనుచితంగా ప్రవర్తిస్తారు. అలాంటి వారి అకృత్యాల బారిన చిన్నారులు పడకుండా ఉండాలంటే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మార్ఫింగ్‌లు.. డీప్ ఫేక్‌లు..! ★★★

అంతర్జాలం మాటున నక్కిన తోడేళ్ల దాడులకు ఎందరో యువతులు, మహిళలు బలైపోతున్నారు. సైబర్ వేధింపులు, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు, వెబ్‌క్యాం హ్యాకింగ్‌లు, అభ్యంతరకర పోస్టులు, మెసెజ్‌లు ఇలా అనేక రూపాల్లో దాడులు చేస్తున్నారు. ఇలాంటి మోసాలు, నేరాలపై మహిళలు జాగ్రత్తంగా ఉండాలి.





మహిళల భద్రతకు అభయ రక్షక దళం.. ★★★

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్



మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళల రక్షణ, వారి భద్రత కోసం అభయ రక్షక దళాన్ని జిల్లాలో ఏర్పాటు చేసి నిరంతరం వారికి అండగా ఉండేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం. మహిళలు, యువతులు, విద్యార్థునుల భద్రత కోసం వీరు నిరంతరం కృషి చేస్తున్నారు. ఏలూరు నగరంలో జిల్లాలోని ఎన్నడూ లేనివిధంగా కళాశాలలు వదిలే సమయాల్లో మహిళా రక్షక దళం ప్రతిరోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తోంది. వారు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, జన సాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, పబ్లిక్ పార్కుల్లో తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ అవగాహన కల్పిస్తూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నారు. ఆపదలో ఉన్న వారు 112 నంబర్‌కు సమాచారం ఇస్తే క్షణాల్లో మహిళా రక్షక దళం అక్కడికి చేరుకుని వారికి సహాయ సహకారాలు అందిస్తుస్తోంది. ఇప్పటికే మహిళల భద్రత కోసం ప్రత్యేక ఫోన్ నంబర్ ఏర్పాటు చేశాం. ప్రతిరోజూ ఆరు నుండి ఏడు ఫిర్యాదులు వాట్సప్ నంబర్‌కు అందుతున్నాయి. ఇప్పటివరకూ 180 ఫిర్యాదులను నేనే స్వయంగా వాట్సప్ ద్వారా పరిశీలించాను. వెంటనే పరిష్కరించాం.

తల్లిదండ్రులు పిల్లలను గమనించాలి.. ★★★

ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి,నరసాపురం



చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు ఇంటికి వచ్చిన తర్వాత ఫోన్లతో ఏం చేస్తున్నారో, ఎవరితో స్నేహం చేస్తున్నారో గమనించాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రేమగా ఉండాలి. విద్యార్థులు, యువతులు వీలైనంత వరకూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. తెలియని వారితో సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దు. ఏమైనా వేధింపులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. ప్రేమ పేరుతో మోసపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో చైతన్య పరుస్తున్నాం. ఏదైనా ఆపద వస్తే అత్యవసర సమయంలో 100, 112 నంబర్లకు సమాచారం అందించాలి.

ఆత్మ రక్షణకు ఆలంబన ఇలా

మహిళలు, యువతులపై ఆగంతులకుల నుంచి దాడుల ముప్పు పొంచి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో వెను వెంటనే స్పందించేందుకు వీలుగా ఈ ఆత్మరక్షణ విధానాలు తెలుసుకోవాలి. శరీరంతోపాటు మానసికంగా కూడా దృఢంగా ఉండాలి. కరాటే వంటివి నేర్చుకోవాలి. కోచింగ్ సెంటర్లకు వెళ్లే వీలు లేని పక్షంలో అంతర్జాలంలో అనేక వీడియోలు అందుబాటులో ఉన్నాయి. మీ కుటుంబ సాయం తీసుకుని వాటిని నేర్చుకోవాలి. ఆగంతకులు దగ్గకు వచ్చి దాడి చేయడానికి ప్రయత్నిస్తే చుట్టూ ఉన్న వారికి వినపడేలా బిగ్గరగా అరవాలి. అయినా పరిస్థితి చేయిదాటిపోతుంటే వచ్చిన వ్యక్తి కళ్లు, గొంతు మోకాళ్లు, సున్నిత భాగాలే లక్ష్యంగా దాడి చేయాలి.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు



బుట్టాయగూడెంలో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అమిత్‌షా బొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఎంసిపిఐ(యు) నాయకులు ఎస్.నాగరాజు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత తలారి ప్రకాష్ మాట్లాడారు. దేశానికి మనువాద, మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ లౌకికతత్వాన్ని, మతసామరస్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించుకునేందుకు పోరాటమే మార్గమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావులతోపాటు ఆయా పార్టీల నాయకులు పుప్పాల కన్నబాబు, యర్రా శ్రీనివాసరావు, జి.రవికిషోర్, ఎం.రామాంజనేయులు, అడ్డగర్ల లక్ష్మీఇందిర, మావూరి విజయ, వి.సాయిబాబా, వి.శ్యామల, మన్నవ యామిని, అరుణకుమారి, ఎ.శ్యామలరాణి, పిచ్చుక ఆదిశేషు, కోరాడ అప్పారావు, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

చాట్రాయి : అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హోలీ మేరీ అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, రమేష్, రాజేష్, వెంకటేశ్వరరావు, సీతయ్య పాల్గొన్నారు.

చింతలపూడి: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా చింతలపూడిలో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడ నుంచి ప్రదర్శనగా బోసుబొమ్మ సెంటర్‌కు చేరుకుని నిరసన తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి కె.గురవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పి.సోమశేఖర్, సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు, రెడ్ స్టార్ జిల్లా నాయకులు డి.రంగనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, సూర్యకుమారి, ఎం.వరలక్ష్మి దేవి, అనురాధ, డి.సత్యనారాయణ, టి.బాబు, ఎస్‌కె.కాలీషా పాల్గొన్నారు.

కుక్కునూరు: అమిత్‌షా రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం స్థానిక సంజయ్‌నగర్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు, మైసాక్షి వెంకటాచారి, సోయం చంద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, నాయకులు ఎం.బాబు, పట్ల లక్ష్మయ్య, మహబూబ్ పాషా రమేష్, సిపిఐ నాయకులు లక్ష్మయ్య, కె.బాబురావు, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు కల్లయ్య పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: సిపిఎం, న్యూడెమోక్రసీ, వామపక్షాల ఆధ్వర్యంలో ర్యాలీ, అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యు.భూషణం, తెల్లం రామకృష్ణ, తగరం బాబూరావు మాట్లాడారు. కార్యక్రమంలో పూర్ణ రాజు, రామిరెడ్డి, చంద్రు బుల్లెమ్మ, సోయం శ్రీనివాసరావు, కన్నా రెడ్డి, అర్జున్‌రావు, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ముసునూరు: అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడగా మండల కార్యదర్శి కోడవలి శ్రీనివాస్, నాయకులు పిల్లి మురళీ, కృష్ణ, గంగుల సత్యం, కంచర్ల పంగిడియ్య, కంచర్ల పోతురాజు, కంచర్ల శ్రీను, చెన్నయ్య, వెంకటేశ్వర్లు, కంచర్ల రమేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: స్థానిక శ్రీనివాస మహల్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు జి.రాజు, ఎన్ఆర్ హనుమాన్లు మాట్లాడారు. అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బోసు, వసంతరావు, శోభనాద్రి, నాగరాజు, సామేలు, సురేష్, సుబ్బారావు, రంగారావు, సిపిఐ నాయకులు చలసాని వెంకట రామారావు, కొమ్మని నాగేశ్వరరావు, నిమ్మగడ్డ నరసింహారావు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్: స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద వామపక్షాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్, సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు సన్నెపల్లి సాయిబాబు, కారం ధారయ్య, పిట్టా ప్రసాద్, కురిమెళ్ల వెంకటేశ్వర్లు, యర్రా మధు, కారం వెంకట్రావు, గుమ్మడి నరసయ్య, కొత్త వెంకటేశ్వర్లు, కొల్లూరి సత్తిపండు, వలగాని సమ్మయ్య, ఇబ్రహీం, కరటం వీరాస్వామి పాల్గొన్నారు.



చింతలపూడిలో..

పోలవరం: స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నేత మడివి చలపతిరావు, ప్రజాసంఘాల నాయకులు మిడియం పండు దొర, కుంజం నాగబాబు, కాకి బాలరాజు, ఈర్నాల జాన్, దొర్నాల గంగాధర్, మడకం వీరస్వామి, బొల్లెంపల్లి యెషయా, కాకి రాజు, కవల సురేష్, కుక్కల రాంబాబు, పొలమటి శ్రీను, పెంటపాటి లక్ష్మణరావు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో

పెదపాడు: అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, మేడేపల్లి దాసు, పిట్టా రహుయేలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా సోమవారం ఆగిరిపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, ఈపూరి రవీంద్ర, షేక్ జహంగీర్ భాషా, ముల్లంగి సభాకర్, జలసూత్రం గోపాలరావు, కె.కిరణ్, షేక్ భాషా, ఎన్.నవీన్. జె.సుబ్బారావు పాల్గొన్నారు.

కలిదిండి: సిపిఎం ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్లో ధర్నా నిర్వహించి, నిరసన చేపట్టారు. అంబేద్కర్ చిత్రపటాలను ప్రదర్శించారు. సిపిఎం మండల నాయకులు గోసంగి వినోద్, సిహెచ్.శ్రీకాంత్, పి.ప్రకాష్, ఎ.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, బి.రామ నాగేంద్రం, పి.రమేష్, ఎస్.లాజర్, జి.అనిల్ కుమార్, జి.దొరబాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, న్యూడెమోక్రసీ, కాంగ్రెస్, రెడ్ స్టార్ తదితర వామపక్షాలు, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత కెవి రమణ, సిపిఎం నేత మానుకొండ జీవరత్నం, సిపిఐ నేత జంపన రమణ రాజు, కాంగ్రెస్ నేత కొల్లి రామసూరిరెడ్డి, రెడ్‌స్టార్ నాయకులు జొన్నకూటి వెంకటేశ్వర్లు, చంద్రన్న వర్గం నాయకుడు ఎస్.సుందరరావు, అడ్వకేట్ తోర్లపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు రాంబాబు, షేక్ మాబు సుభాని, వంగా గోపీ, కూనపాము విఘ్నేష్, కుంచె వసంతరావు, శ్రీను, సరియం రామ్మోహన్, ఎం.శ్రీనివాస్, ఇ.భూషణం, బి.వినోద్, కె.రామలక్ష్మి, ఎం.లక్ష్మి, మడకం రామన్న, బొడ్డు వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మొదటిరోజు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి చేసామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ మైదానంలో సోమవారం నుంచి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు ఏలూరు పరిధిలో 4,976 మంది అభ్యర్థులు అర్హత సాధించగా వారిలో 3,997 మంది పురుష అభ్యర్థులు, మహిళలు 979 మంది ఉన్నారు. వీరిలో మహిళా అభ్యర్థులకు జనవరి మూడు, నాలుగు తేదీలలో ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. పురుష అభ్యర్థులకు నేటి నుంచి పరీక్షలు మొదలయ్యాయి. సోమవారం ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరయ్యేలా పోలీసు శాఖ సమన్వయం చేయగా వారిలో 309 మంది అభ్యర్థులు మాత్రమే ఈ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. ఈ 309 మందిలో 179 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షల్లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా వీరి కోసం ఒక వైద్య శిబిరాన్ని, రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. సోమవారం నిర్వహించిన పరీక్షల్లో 179 మంది అభ్యర్థులు అర్హత సాధించారని ఆయన తెలిపారు. ఈ పరీక్షల్లో ఎవరికైనా ఎటువంటి అసౌకర్యాలు కలిగిన వెంటనే తమకు ఫిర్యాదు చేయవచ్చునని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, డిఎస్‌పిలు, ఎస్‌ఐలు, సిఐలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ప్రచార జాతాను జయప్రదం చేయాలి

ముసునూరు : జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల రాంబాబు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 31న ప్రచార జాత నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాత మండలంలోని రమణక్కపేట గ్రామంలో సాయంత్రం మూడు గంటలకు వస్తుందని, మండలంలోని యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు వందల సంఖ్యలో పాల్గొని, జాతాకి ఆహ్వానం పలుకుతూ, నూజివీడు వరకు కొనసాగే బైక్ ర్యాలీలో పాల్గొనాలని మండల ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల రాంబాబు పిలుపునిచ్చారు. కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని అధ్యక్షులు పద్మ కిషోర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గంగాయుడు తెలిపారు.

అనువంశిక వ్యాధులపై సర్వే

పోలవరం : మండలంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో(ఎన్‌సిడి స్క్రీనింగ్ ఫర్ నాన్ కమ్యూనికల్ డిసీజెస్, కమ్యూనికల్ డిసీజెస్) సంక్రమిత, అనువంశిక వ్యాధులపై సోమవారం సర్వే నిర్వహించారు. బెస్తవీధిలో జరిగిన ఈ సర్వే కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధులు, షుగర్, బిపి, పక్షవాతం, తదితర వివరాలు, ఎత్తు, బరువు, కుటుంబ వివరాలు, ఆహారపు అలవాట్లు, మద్యం, ధూమపాన వివరాలతో సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం పోశమ్మ, ఆశ వర్కర్లు, గోకా అరుణ, బీరా రత్నాజీ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

నూజివీడు టౌన్ : ఇంటర్మీడియట్ విద్యార్థులకు నూతన సంవత్సర కానుకగా మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టనున్నట్లు శ్రీమదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సుబ్బరత్న తెలిపారు. నూజివీడులోని ప్రిన్సిపల్ సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశంతో వచ్చే ఏడాది జనవరి మూడవ తేదీ నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు జరుగుతుందన్నారు. ఎప్పటి వరకు మధ్యాహ్నం వేళల్లో విద్యార్థులు భోజనానికి వెళ్లి రావడం జరుగుతుండడం, ఇకపై కళాశాలలోనే మధ్యాహ్న భోజనం అందిస్తామన్నారు. దీని ద్వారా నూరు శాతం హాజరు, పరిపూర్ణమైన పౌష్టికాహారం సాధ్యమవుతుందన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత, అత్యుత్తమ ఫలితాల కోసం నిత్యం కృషి చేస్తున్నట్లు వివరించారు.

అభివృద్ధికి సహకరించండి : ఎంపిపి

చాట్రాయి : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి చేయాలని సోమవారం చాట్రాయి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిపి లంకా నిర్మల పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఫైలేరియా ప్రాజెక్టులో గర్భిణులకు సుమారు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 102 అంబులెన్స్ వాహనంలో తీసుకొని వెళ్లి, పరీక్షలు నిర్వహించి, రాబోయేవి ప్రసవాలు కనిపెట్టి సుఖప్రసవం జరిగే విధంగా సూచనలు చేయడం జరుగుతుందని అన్నారు. విద్యుత్ శాఖ అధికారి సంజయ్ మాట్లాడుతూ పిఎం సూర్య కింద మండలంలోని ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు సోలార్ పవర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని, మండలంలోని ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు వినియోగించుకోవాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలను రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని, నమోదు చేయించుకున్న వారికి ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, సబ్సిడీలు, పంట నష్టాలు అందుతాయని అన్నారు. ఈ సమావేశానికి ఎంపిపి లంకా నిర్మల అధ్యక్షత వహించగా ఎండిఓ. విజయలక్ష్మి, వైద్యాధికారి విజయలక్ష్మి, విద్యాశాఖ అధికారి బ్రహ్మచారి, గ్రామ సర్పంచులు ఎం.మారెమ్మ పాల్గొన్నారు.

తహాశీల్దార్‌పై ఫిర్యాదు

విచారిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్

చాట్రాయి : మండలంలో తహాశీల్దార్ డి.ప్రశాంతి అవినీతికి పాల్పడి కొందరికి పట్టాదారు పాస్ బుక్‌లు ఇవ్వాలని ఆరోపణలతో వచ్చిన ఫిర్యాదుపై నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ సోమవారం చాట్రాయి తహాశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదులను విచారించారు. ఈ విచారణకు తహాశీల్దార్‌పై ఆరోపణలతో ఫిర్యాదు చేసిన కల్లెపల్లి ప్రభాకర్ రావు హాజరు కాకపోవడంతో పిర్యాదులో ఉన్న భూముల రికార్డులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. రైతులు చాట్రాయి, జనార్ధనవరం, నరసింహారావుపాలెం, సోమవరం గ్రామాలకు సంబంధించిన వీఆర్‌ఓలు తమ భూములను ఆన్‌లైన్ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, తహశీల్దార్ చెప్పినా కొందరు వీఆర్‌ఓలు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సర్వేయరు తమ సర్వే రిపోర్ట్ ఇవ్వకుండా వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని సబ్ కలెక్టర్‌కు చెప్పుకోగా ఎవరు మిమ్మల్ని డబ్బులు డిమాండ్ చేశారో తహశీల్దార్‌కు రాసి ఇవ్వమని రైతులకు చెప్పారు. తదుపరి చర్యలు చేపడతామన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలియని వ్యక్తి రైలు బండి ఢీకొని మృతి చెందిన ఘటన ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. అతని వయసు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు అంచనా వేస్తున్నారు. అతని మొఖం పూర్తిగా ఛిద్రం కావడంతో అతన్ని గుర్తించేందుకు రైల్వే పోలీసులకు కొంచెం కష్టతరంగా మారింది. ప్రాథమిక సమాచారం ప్రకారం అతను తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం సమీపంలోని ఈతకోట గ్రామానికి చెందిన వాడిగా తెలుస్తుందని, అతని వివరాలు తెలిసినవారు ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్‌ను సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మార్చురికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కొయ్యలగూడెం : బెల్ట్ షాపు నిర్వహణ నిమిత్తం అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ సోమవారం పేర్కొన్నారు. ఎర్రంపేట గ్రామానికి చెందిన చాపల నాగేశ్వరరావు వద్ద 48 క్వార్టర్ బాటిల్స్ లభించినట్లు అంకాలంగూడెం సమీపంలో పట్టుబడ్డాడని తెలిపారు. ముద్దాయి మద్యం బాటిళ్లు తరలిస్తున్నారన్న సమాచారంతో తాము దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్థానికంగా కలకలం ప్రచారం ఉంటే బెల్టు కన్నా ఎక్కువకు చెందిన ఒక మద్యం దుకాణంలో వారి ప్రచారం సాగుతోంది.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని సుంకొల్లు గ్రామంలో జరిపిన దాడులలో ఆరేపల్లి పూర్ణచంద్రరావు వద్ద 4 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకొని, కేసు నమోదు చేసి, నూజివీడు కోర్టుకు తరలించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఈ దాడులలో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై.ఈశ్వర రావు, ఎమ్.ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా సోమరాజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా జంగారెడ్డిగూడెం ఇండియన్ స్కూల్స్ కరెస్పాండెంట్ జిఎన్‌వి సోమరాజు ఎన్నికైయ్యారు. ఆదివారం కెఎల్ యూనివర్సిటీ విజయవాడలో జరిగిన స్టేట్ జనరల్ బాడీ మీటింగ్‌లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని స్టేట్ అసోసియేషన్ కమిటీ అభినందించారు.

పిచ్చికుక్క దాడి : పదిమందికి గాయాలు

ముసునూరు : మండలకేంద్రమైన ముసునూరు గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి పదిమందికిపైగా గాయపరచగా, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని ఏ గ్రామ పంచాయతీలో చూసినా కుక్కల బెడద ఎక్కువగా కనిపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ మనుషులపై మేక, గొర్రె, కోళ్లపైన కూడా దాడికి సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే ముసునూరు గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి మద్దాల కుమారి ఆశా వర్కర్, వెంకటేశ్వరరావు లారీ డ్రైవర్, ఇలా వ్యవసాయ పనులకు వెళ్లే పది మందిని అడ్డగించి ముఖం, చేతులపై పిచ్చికుక్క గాయపరిచింది. క్షతగాత్రులైన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చికిత్స పొందుతున్నారు. అయితే గ్రామ యువకులు చివరికి ఆ కుక్కని దాడి చేసి చంపేశారు.

ఐద్వా పట్టణ కన్వీనర్‌గా దుర్గాభవాని

నూజివీడు టౌన్ : ఐద్వా పట్టణ కన్వీనర్‌గా దళాయి దుర్గా భవాని ఎన్నికయ్యారు. మండల పరిధిలోని రెల్లి పేట ఐద్వా పట్టణ కమిటీ సోమవారం నండూరి పద్మాంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 25 మంది మహిళలు పాల్గొని కన్వీనర్‌గా దళాయి దుర్గ భవానీని ఎన్నుకొన్నారు. ఈ కమిటీ మొత్తం ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎజెండాగా సంక్రాంతి ముగ్గులు పోటీలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారని నండూరి పద్మాంజలి తెలియజేశారు.

భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ముదినేపల్లి : భూ సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని మండల తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని వడాలి, కోమర్రు గ్రామాల్లో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుభాని మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సదస్సులో ప్రజలు, రైతుల నుంచి వచ్చిన అర్జీలను తీసుకున్నామని, వాటిని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు మరీదు దుర్గశ్రీ, కె.సాయికృష్ణ, విఆర్‌ఒ పద్మావతి పాల్గొన్నారు.

'మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో ఈనెల 31న నూతన సంవత్సర వేడుకల పేరుతో మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని జీలుగుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరావు హెచ్చరించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 రాత్రి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాత్రి పెట్రోలింగ్ గస్తీని ముమ్మరం చేసామన్నారు. ముఖ్యంగా యువత రోడ్లపై మద్యం తాగి రాష్‌గా వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు నిర్వహించడం, లౌడ్ స్పీకర్లతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పారిశ్రామిక సందర్శనలు విజ్ఞానాభివృద్ధికి దోహదం

పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబూరావు

ప్రజాశక్తి - చింతలపూడి

పారిశ్రామిక సందర్శనతోనే విద్యార్థులలో విజ్ఞానం, ప్రతిభ మెరుగుపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విస్సంపల్లి బాబూరావు పేర్కొన్నారు. శ్రీపొట్టి మాణిక్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు పారిశ్రామిక సందర్శనకు స్థానిక రేచర్లలోని 11 కేవీ సబ్ స్టేషన్‌ను సోమవారం సందర్శించి, పనిచేసే విధానాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యుత్ పరికరాల వినియోగం, విద్యుత్ పొదుపు, విద్యుత్ రీడింగ్ తీసే విధానంపై పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు మోహన్ విద్యార్థులకు వివరించారు. అంతే కాకుండా వర్షాకాలంలో విద్యుత్ పరికరాలు వినియోగించడం, షార్ట్ సర్క్యూట్ సందర్భాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు అప్పిరెడ్డి రాము, ఉపాధ్యాయులు, ఒకేషనల్ ట్రెయినర్స్ రుక్మిణి శ్రీవిద్య పాల్గొన్నారు.

స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయం

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక ఎంఎల్‌ఎ కార్యాలయంలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమాలు వివరాలతో రూపొందించిన వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రోషన్ కుమార్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా చింతలపూడి నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలతో పాటు యువతకు అవసరం అయినటువంటి కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు అందించడం శుభ పరిణామం అన్నారు. రాబోయే రోజుల్లో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి కార్యదర్శి షేక్ మొహిద్దిన్ భాష, అధ్యక్షుడు చేపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి రాజశేఖర్ రెడ్డి, గుమశావళి మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు

ముసునూరు : విద్యార్థులు తమ ప్రతిభను కనబరచటానికి విద్య, వైజ్ఞానిక వేదిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు ఆయా ప్రాజెక్టు పనులు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య, వైజ్ఞానిక వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రథమ బహుమతి ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాగా, ద్వితీయ బహుమతి ఎపి గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు, తృతీయ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెక్కపల్లి విద్యార్థులకు ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాట్రాయి : వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో విజ్ఞాన ఆవిష్కరణలకు ప్రేరణ కల్పించడం, ఆవిష్కరణాత్మక అంశాలపై దృష్టి పెంపొందించడానికి దోహద పడుతుందని మండల విద్యాశాఖాధికారి వివిఎస్వి.బ్రహ్మచారి అన్నారు. దక్షిణ భారత విద్య, వైజ్ఞానిక ప్రదర్శన(ఎస్ఐఎస్ఎఫ్) 2025లో భాగంగా జిల్లాస్థాయి పోటీలకు మండలంలో మూడు విభాగాల నుంచి ఎంపికయ్యారు. విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం(విఐటిఎమ్), బెంగళూరు సహకారంతో, కమిషనర్ పాఠశాల విద్య ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాట్రాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వివిఎస్వి.బ్రహ్మచారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించే అద్భుత వేదిక ఇదని అన్నారు. భౌతిక శాస్త్రంలో సి.గుడిపాడు ఉన్నత పాఠశాల నుంచి రెండు ప్రదర్శనలను, పర్యావరణ శాస్త్రంలో నీటి నిల్వపై జెడ్‌పిహెచ్‌ఎస్ పోలవరం నుంచి ఒక ప్రదర్శనను ఎంపిక చేసి జిల్లా స్థాయికి ఎంపిక చేయటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువగట్టు ఆక్రమణలు తీయాల్సిందే!

ఉంగుటూరు: ఏలూరు కాలువ గట్టు వెంబడి ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరంలో ఆక్రమణలను కోర్టు తీర్పు ఆధారంగా ఖచ్చితంగా తొలగించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అని మండల ప్రత్యేక అధికారి, జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్, డిఎల్‌పిఒ చంద్రశేఖర్ ఆదేశించారు. మండలంలోని ఏలూరు కాలువ వెంబడి ఇరుపక్కలా ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణలపై కోర్టు తీర్పు ఇచ్చినా కోర్టు తీర్పును అమలు చేయకపోవడంతో జిల్లా అధికారులకు కోర్టు సమన్లు ఇవ్వడంతో ఆక్రమణలు తొలగించేందుకు డిఎల్‌పిఒని జెఎసి ఛైర్మన్ జిల్లా కలెక్టర్ నియమించారు. ఈక్రమంలో ఆక్రమణల తొలగింపుపై ఇప్పటికే రెండు సార్లు సమావేశాలు జరగ్గా సోమవారం ఉంగుటూరు కమ్యూనిటీ హాలు జెఎసి మూడవ సమావేశం నిర్వహించారు. బాదంపూడి, వెల్లమిల్లిలో ఇటీవల ఆక్రమణలు తొలగించడంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల పనితీరును అధికారులు అభినందిస్తూ ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరంలో కూడా వారిని స్ఫూర్తిగా తీసుకుని కార్యదర్శులు యాక్షన్ ప్లాన్ రూపొందించి, ఆక్రమణలు తొలగించాల్సిందేనని ఆదేశించారు. ఉంగుటూరులో 130, నారాయణపురంలో 138, చేబ్రోలు 34, కైకరంలో 131 ఆక్రమణలున్నాయి. వీటిలో కైకరంలో 68 మంది కోర్టుకెళ్లగా వాటిని మినహాయించి మిగతా వాటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి బివి నర్సింహరాజును జెఎసి ఛైర్మన్ ఆదేశించారు. నారాయణపురంలో 18 మంది కోర్టుకు వెళ్లగా కోర్టు పిటిషన్‌ను డిస్పోజ్ చేయడంలో తదుపరి ప్రొసీడింగ్ ప్రకారం ఆక్రమణలు తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఎన్.విజయ్‌కుమార్‌కు మార్గదర్శకాలు జారీ చేశారు. ఉంగుటూరులో 8 మంది కోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కోర్టుకేసులు, స్టే ఆర్డర్ ఉన్నవాటిని వదిలేసి మిగతా వాటిని ఖచ్చితంగా తొలగించాల్సిందేనని, లోకాయుక్త ఉత్తర్వులను గౌరవించాలని కోరారు. చేబ్రోలు కార్యదర్శి జీడీ శ్రీనివాసరావు, విద్యుత్ ఎఇ శ్రీరామ్, హౌసింగ్ ఎఇ చింతలపూడి సతీష్, విఆర్‌ఒ కుచ్చు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని మండల స్థాయి అధికారులతో, డిఇలతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.వెంకట లక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పాల్గొని మండలంలోని అన్ని శాఖలపై సమీక్ష చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, డిఇలు ప్రగతి నివేదికలతో హాజరు కాగలరని తెలిపారు.

సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

మండవల్లి : అవినీతి అక్రమాలను వెలికి తీసి అడ్డుకట్టు వేసేందుకు సమాచార హక్కు చట్టం ఎంతగానో దోహదపడుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కర్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వివరాలను తెలియపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ తహశీల్దార్ సుధారాణికి వినతిపత్రం అందించి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 2005 అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చిందని అన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో విధిగా సమాచార బోర్డు ఏర్పాటు చేసి సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి పేరు, ఫోన్ నెంబర్ ఫ్యాక్స్, ఇ మెయిల్ అడ్రస్ తప్పనిసరిగా ఉంచాలని చట్టం చెబుతుందని అన్నారు. అయితే ఏ కార్యాలయంలో ఆ విధంగా లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు సమాచార బోర్డు ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. మండల అధ్యక్షుడు అప్పారావు, బండి రంగారావు పాల్గొన్నారు.

'క్రీడలు మానసిక, శారీరక ధృఢత్వానికి దోహదం'

ఆగిరిపల్లి: క్రీడలు మానసిక, శారీరక ధృఢత్వాని పెంపొందించడంతో పాటు, దేశ సమగ్రతను, ఐక్యతకు దోహద పడతాయని మైక్రాన్ టెక్నాలజీస్ ఉపాధ్యక్షులు మాకినేని శివ అన్నారు. గత రెండు రోజులు మండల పరిధిలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో హెచ్‌సిఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్ ఫర్ చేంజ్ అండర్-16 కబడ్డీ పోటీలు ముగింపు సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్-16 బాలుర విభాగంలో మధురై, చెన్నై, బెంగుళూరు జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా, బాలికల విభాగంలో చెన్నై, బెంగుళూరు, నాగపూర్ జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఈ కార్యక్రమానికి హెచ్‌సిఎల్ ఫౌండేషన్ స్పోర్ట్స్ అసోషియేట్ మేనేజర్ బిఆర్.నంద గోపాల్ అధ్యక్షత వహించగా, హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్య ప్రసాద్, హీల్ సిఇఒ కె.అజయ్ కుమార్, ఆసియన్ గేమ్స్ బంగారు పతక గ్రహీత కళ్యాణి, హీల్ స్పోర్ట్స్ వాలంటీర్లు బి.సుధాకర్, ప్రొపెసర్ కిశోర్, ఎవి.కృష్ణారావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామ్ సుధాకర్, ఎకెఎఫ్ఐ ప్రతినిధి కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, క్యాంపస్ ఛైర్మన్ పి.ధనప్రకాశ్‌లు పాల్గొన్నారు.

టిడిపి చిన్నంపేట నాయకుడు మృతి

చాట్రాయి : టిడిపి మండల మాజీ అధ్యక్షుడు, చిన్నంపేట మాజీ సర్పంచి, సీనియర్ నాయకులు అత్తులూరి నరసింహారావు(84) సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. నరసింహారావు 11 ఏళ్లు సర్పంచిగా, 2 సార్లు టిడిపి మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సీనియర్ లాయర్ అత్తులూరి శ్రీనివాసరావుకు స్వయాన బాబాయి. చిన్నంపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.